# బనేవా

ఐదారేళ్ళ క్రితం—

తేదీ, తిథి, వార, నక్షత్రాలు గుర్తులేవు.

ఓరోజు సాయంత్రం శర్మ నా కతన్ని పరిచయం చేసేడు. పేరు రామ్మూర్తి. ఉద్యోగం ఫలానా ఆఫీసులో గుమాస్తా. మా వూరికి బదలీఅయి వచ్చాడు.

రామ్మూర్తికీ నాకూ మధ్య స్నేహం చాలా తొందరగా వృద్ధి కాసాగింది. దీనికో కారణంవుంది. మేఁవిద్దరవూఁ వొకేజాతి పక్షులం. అతనికి నాటకాలువేసే జబ్బుంది. కాకుంటే నేను కథలుకూడా రాస్తాను.

మా స్నేహానికి నవమాసాలు నిండినరోజున అతనో చిన్న 'ట్రిక్' చేశాడు. ఆరోజు మధ్యాహ్నం రామ్మూర్తి నాకు ఫోన్ చేసేడు— సాయంత్రం పార్కుకి రావలసింది; శర్మ, చంద్రమౌళి, వినాయకరావ్ వగైరాలంతా వస్తారు ఆవటా అని. నేను సరే అన్నాను.

సాయంత్రం పార్కులో మా అందరికి కాఫీలు పోయించాడు రామ్మూర్తి. ఆతర్వాత సిగరెట్ కేస్‌లోంచి సిగరెట్ తీసి వెలిగించుకొన్నాడు. ముక్కు మీద కళ్ళజోడు కుడిచేతి చూపుడు వేలుతో సరిచేసుకున్నాడు. అదొక అలవాటతనికి. కనీసం పదినిముషాలకొకసారయిన అతనిచేయి ఆ అసంకల్ప ప్రతీకార చర్యని చేస్తూ వుంటుంది.

'నే చెప్పబోయే విషయం విని మీరేం కంగారు పడకండి' అంటూ మొదలెట్టేడతను. 'మూర్తిగారితో పరిచయమైన రోజు నేనో ప్రొడ్యూసర్‌కి జాబు వ్రాశాను. తాను తీయబోయే చిత్రంలో నాకో వేషం ఇవ్వమని' అంటూ నావైపు చూశాడు రామ్మూర్తి.

"గుడ్‌న్యూస్ .... అయితే ఇవాళ జవాబొచ్చిందన్న మాట" శర్మ అడిగేడు.

"చెప్తాను" అని సిగరెట్‌దమ్ము గట్టిగా లాగేడు రామ్మూర్తి. "అప్పట్నుంచి ప్రతినెల అదేరోజున అదే నిర్మాతకి జాబు రాస్తున్నాను."

' అయితే ఇంకేం ....ఊపేసిండు!' చంద్రమౌళి చిత్రంగా అన్నాడు.

"రాయాలి మాష్టారు.... అలాగే రాయాలి.... ఆ 'జీల్' వున్నప్పుడే సాధ్యమైనన్ని ప్రయత్నాలు చెయ్యాలి."

"ఓ.... కే....కొట్టండి.... ఇంతకీ ఏచిత్రంలో వచ్చింది ఛాన్స్" వినాయకరావ్ అడిగేడు.

రామ్మూర్తి కళ్లజోడు సరిచేసుకున్నాడు. 'అదే పాయింట్ కొస్తున్నాను. అలా ప్రతినెలా అదేరోజున రాసిన ప్రణిజాబుని ఒకే నిర్మాతకు పంపించాను. అంటే వెరసి తొమ్మిది ఉత్తరాలు ఇప్పటికి. అన్నీ ఒకచ్చోట్లో వెళ్లినయ్. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాటిలో ఏఒక్కటికీ కూడా ఇవ్వాల్టిదాకా జవాబు రానూలేదు అతీగతీ తేలనూలేదు. చిత్రమేమిటంటే ఆ జాబులన్నిటి సంగతీ ఈ నాటికీ అలాగే వుండి పోయింది."

ఆతర్వాత చాలాసేపు సినిమా ఛాన్స్‌ల గురించే సాగింది సంభాషణ.

తొమ్మిదిగంటల ప్రాంతంలో మేమందరంవిడిపోయాం. రామ్మూర్తి నాతోనే వచ్చాడు. కోనేటి సెంటర్ దాకా వచ్చి నిలబడ్డాం. అక్కడ మా దారులు వేరవుతాయ్.

'నేవస్తా మాస్టారూ మరి' అని సెలవు తీసుకోబోతూ ఠక్కున అడిగేడు 'వో రెండ్రూపాయలు కావాలి మాస్టారు" అని.

'అలాగే' అంటూ రెండు నోట్లు తీసిచ్చాను. అతను థ్యాంక్స్ చెప్పి వెళ్లిపోయాడు.

ఈ సంఘటనతో నటుడిగా రామ్మూర్తి గుర్తుకువచ్చి నప్పుడెల్లా వినాయకరావు జోకూ గుర్తుకొస్తూంటుంది. అత నంటూ వుంటాడు, 'గురువుగారిది వన్ వే ట్రాఫిక్. రామ్మూర్తి జాబులకి జవాబులివ్వటం నేరంగా భావిస్తున్నారన్న మాట సినిమాలవాళ్ళు' అని.

వినాయకరావ్ మాటల్లోని "వన్ వే ట్రాఫిక్" పదం నాకు మరో అర్థాన్ని స్ఫురింప జేస్తూ వుంటుంది.

రామ్మూర్తి నాకాతర్వాత మరికొంచెం సన్నిహితుడైనాడు. లైబ్రరీ వరండాలోనో, పార్కులోనో, మా ఆఫీస్ క్యాంటిన్‌లోనో, వాళ్ల ఆఫీసు బయటి తంగేడిచెట్టు క్రింద—చాలా తరుచుగా కలుసుకోసాగేం మేము. అంతే గాక రెండు మూడుసార్లు అతని శ్రీమతిని తీసుకుని మా ఇంటి కొచ్చాడు రామూర్తి. ఆవిధంగా మాఇంటి ఆవిడకి, రామ్మూర్తి భార్యకి గూడా స్నేహం కలిసింది, ఆవిడపేరు జయమ్మ.

రామూర్తీ నేనూ అంతగా దగ్గర కావటానికి ముఖ్య కారణం ఇంకొకటివుంది. అది మేమిద్దరమూ కలసి అతి తరచుగా సినిమాలకు పోవటం. అందులోను రాత్రి సెకండ్ షోకి. శర్మ, చంద్రమౌళి సెకండ్ షోని నిషేధించిన మనుషులు. వినాయకరావ్ తొమ్మిది దాటితే నిద్రకాయలేడు.

రాత్రిళ్ళు ఏ ఎనిమిది తొమ్మిదింటికో వచ్చి "మాష్టారు కొత్త పిక్చరు చూపించరూ" అనేవాడు. నేను 'అలాగే సార్' అంటూ కదిలేవాణ్ని.

ఆర్థికంగా ఆలోచిస్తే రామ్మూర్తీ నేనూకూడా సగటు మనుషులమే. కాకుంటే నా జీతంరాళ్ళు నాలుగు ఎక్కువ అన్నది యదార్థం. బహుశా ఈ వ్యత్యాసమే డబ్బుకు సంబంధించినంత వరకూ నన్ను రామ్మూర్తికన్నా ఓ మెట్టుపైన నిలబెట్టినట్టుంది. సినిమాలకూ, సాదర్లకూ రామ్మూర్తి నన్నా

శ్రయించేవాడు. ఎప్పుడూ మొహమాటానికన్నా తను సినిమా టిక్కెట్లు కొంటాననేవాడుకాదు రామ్మూర్తి. నేనూ ఆవిషయం పట్టించుకునేవాణ్ని కాదు. అలాగే మేమిద్దరమూ ఎక్కడ కలుసుకున్నా సరే, ఆ వెంటనే రామ్మూర్తి కాళ్ళు హోటల్ వైపు దారితీసేవి. అక్కడిదాకా వెళ్ళిన తరువాత "కాఫీ తాగించండి" అనేవాడు. నేను నవ్వి లోపలికి నడిచేవాణ్ని.

కాఫీ పేరుతో లోపలికి తీసుకొచ్చినా ఘనపదార్థాలంటేనే రామ్మూర్తికి ఇష్టమెక్కువ. వాటినే ఆర్డరిస్తూవుండేవాడు. సర్వర్ బిల్లు రాస్తూండగానే జోక్ వేసేవాడు రామ్మూర్తి. "బాబ్బాబు....అది ఇటు చూపకు. ఆ అంకెలు చూస్తే తిన్న టిఫిన్ కాస్తా నీరయిపోతుంది, కళ్ళు తిరగవచ్చు" అంటూ.

ఆ రోజు—

ఆడిటోరియంలో 'బ్రిడ్జి' టోర్నమెంట్స్ జరుగుతున్నాయి. నేనూ ఆడుతున్నాను. రాత్రి ఎనిమిది దాటింది. రామ్మూర్తి వరండాలో నిలబడి నాకోసం కబురు చేసేడు. నేను బయటికొచ్చాను, "ఏం మాష్టారూ....విశేషాలేమిటి?" అంటూ.

"యేమున్నది గురూగారూ" అంటూ కళ్ళజోడు సరిచేసుకున్నాడు. "ఏమిటీ టోర్నమెంటా?" అంటూ పరామర్శించాడు. నేను అవునన్నాను.

"నలభై నిముషాల్నుంచీ కాపలా కాస్తున్నా మాస్టారూ, మీరు బయటికొస్తారేమో అని" అదోలా నవ్వాడు.

"ఈజిట్?" అంటూ ఆశ్చర్యపోయాన్నేను.

"ఊఁ....మూర్తిగారూ, వోసాయం చెయ్యాలండీ. మా వదినా పిల్లలు వచ్చారట యింటికి. మా ఆవిడ ఆఫీసుకు కబురుచేసింది. ఇంట్లో తండులాలు నిండుకున్నాయి. సాయంత్రం ఐదింటినుంచీ తీవ్రమైన పోరాటం సాగించి, అందరిచేతుల్లోనూ తోడిపోయి ఇంక చెప్పట మెందుకు.... అన్యధా శరణం నాస్తి."

నేను జేబుచూసుకున్నాను. ఆరురూపాయలున్నాయి. అదే అన్నాను "ఎంతకావాలో తీసుకోండి."

"వో ఫైవివ్వండి"

డబ్బు తీసికొని వెళ్ళిపోయేడు రామ్మూర్తి.

నేను గూటికి చేరేసరికి పదకొండుఃదాటింది. నాశ్రీమతి రమ సినీమాకువెళ్ళి వచ్చిందట. నేను స్నానంచేస్తూంటే చెప్పింది "జయమ్మగారు కూడా పిక్చర్‌కి వచ్చింది"

నాకు రామ్మూర్తి మాటలు గుర్తుకొచ్చాయి. "ఆవిడ ఒక్కతే వచ్చిందా?" — అడిగాను.

"అవును. ఆవిడా, వాళ్ళ అబ్బాయిలు ఇద్దరూ వచ్చారు."

"ఆవిడవెంట యింకెవరూ లేరా?" అనుమానంగా గ్రుచ్చిగ్రుచ్చి అడిగాను.

రమ నవ్వింది. "ఏంవిటీ డిటెక్టివ్‌లా ప్రశ్న లేస్తున్నారు. ఇంకెవ్వరూ రాలేదు. ఆవిడా పిల్లలే వచ్చారు" అంది కళ్ళు చికిలిస్తూ.

మరి, రామ్మూర్తి అలా ఎందుకు చెప్పాడా నాదగ్గర అనే అనుమానం కలిగింది నాకు. అయితే ఆ విషయం గురించి ఎక్కువగా ఆలోచించలేదు నేను. ఏదో అవసరానికి అబద్ధం ఆడేడేమోనని సరిపుచ్చుకున్నాను.

మరో పదిరోజుల కనుకుంటాను. రామ్మూర్తి మా ఆఫీసుకొచ్చాడు. కాసేపు కథల కబుర్లు చెప్పుకున్నాం. నే నేమీ రాయకపోవటంమీద చాలా సేపు తోమేడు రామ్మూర్తి. క్షణాలతర్వాత అడిగాడు, "మూర్తిగారూ మీకు క్లాత్ షాపులో కాతా వుందికదూ...."

నేను ముక్తసరిగా 'వుంది' అన్నాను. అతను కళ్ళజోడు సరిచేసుకుంటూ ఎటో చూపులు మరల్చేడు. మా యిద్దరికీ ఒకరి వ్యక్తిగత విషయాలు, కుటుంబ సమస్యలూ మరొకరికి - చాలావరకూ- తెలుసు.

"మొన్న మా సిస్టర్ వాళ్ళమ్మాయ్ వచ్చిందండీ. ఆవిడకి పెళ్ళయి ఏడేళ్ళయింది. ఇప్పటిదాకా ఏనాడూ మా యింటికి రాలేదు. నేనూ చెల్లెలుగదా అని ఏనాడూ ఏంవీ పెట్టుపోతలు జరపలేదు. ఆవిడ్ని ఇవాళ పంపించాలండి."

నాకు మొదట్లోనే విషయం అవగతమైంది.

"మా ఆవిడేమో చీరే రవికా తెమ్మని పోరుతోంది. మా సంగతి మీకు తెలుసుకదా? అసలే అంతంతమాత్రం. అందులోనూ ఇది 'పాపర్ వీక్'."

అతను నెలలో నాలుగు వారాల్నీ నాలుగు పేర్లతో పిలుస్తూవుంటాడు—సూపర్ వీక్, పేపర్ వీక్, కాపర్ వీక్, పాపర్ వీక్ అంటూ.

రామ్మూర్తి మరోసారి కళ్ళజోడు సరిజేసుకొని అడిగాడు, "మీ ఖాతాలో ఆ రెండూ ఇప్పించి పుణ్యం కట్టుకోవాలి."

"సరే అలాగేలెండి" అన్నాన్నేను కాదనలేక. కాఫీలు తాగిన తర్వాత ఇద్దరంవూ కొట్టుకువెళ్ళేం. రామ్మూర్తే సెలక్టు చేశాడు, చీరె, జాకెట్ పీసూ. బిల్లు ఇరవై ఆరు రూపాయలయింది. నా ఖాతాలో రాయించి బయటికొచ్చేను. రామ్మూర్తి 'చాలా చాలా థాంక్సు' చెప్పి వెళ్ళిపోయాడు. అతి నా బిల్లుతాలూకు సొమ్మును ఎలాగూ చెల్లువేయలేడని నాకు తెలుసు. ఎందుకనంటే అతని వ్యవహారం 'వన్ వే ట్రాఫిక్' కనుక. అయినా రామ్మూర్తి అడిగినదానికి నే నెందుకు కాదనలేకపోయానో నాకే తెలీలేదు. ఆ తర్వాత వితర్కించుకుంటే అసలు బలహీనత ఏవిటో తెలిసింది. అది నాలోని మెతకదనం.

ఆ రాత్రి పొరపాటున టేబుల్ మీద పడేసిన బిల్లు గురించి ప్రశ్నలవర్షం కురిపించింది రమ. వాస్తవం చెప్పాను. ఆమెకూడా నా చర్యను సమర్థించలేదు. పైగా నా మెతకదనాన్ని ఎత్తిపొడుపు మాటలతో నిందించింది.

రెండు రోజుల తర్వాత సాయంత్రం పార్కులో కలిశాడు రామ్మూర్తి. శర్మా, చంద్రమౌళి, వినాయకరావ్ అందరమూ వున్నాం. చాలాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. ఉన్నట్టుండి రామ్మూర్తి నాకో పోస్టు కార్డు యిచ్చాడు. నేను తీసుకుని చదివాను. అది వాళ్ళ చెల్లెలు రాసిన ఉత్తరం. ఆమె రామ్మూర్తి ఆదరణకు అతను పెట్టిన చీరె రవికలుకు కృతజ్ఞత చెబుతూ రాసింది

'ఎక్కణ్ణుంచీరోయ్ ఆ వర్తమానం? ఏ జాబుకన్నా పురుడొచ్చిందా?' అంటూ నవ్వేడు వినాయకరావ్. అందరు గొల్లున నవ్వేరు. అలాంటిదేం లేదనీ, తనజాబులకి కన్నెప్పనే గానీ డెలివరీ లేదని ఎదురు జోకేశాడు రామ్మూర్తి. మరోసారి అందరమూ నవ్వుకున్నాం.

బయటకి వచ్చేస్తుండగా రామ్మూర్తి హోటల్ కేసి దారితీసేడు. "నిజంగా మీ ఋణం తీర్చుకోలేనిది గురూగారు. ఆడపిల్ల ఎంత అల్పసంతోషో ఇప్పుడర్థమైంది నాకు. ఆసంతోషాన్ని నాకు, మా అమ్మాయికి కలిగించిన మీకు నిజంగా కృతజ్ఞుణ్ణి."

"దానిదేముంది లెండి. నేనసలు గుడ్డలకొట్లో ఖాతా పెట్టింది మా ఐదుగురు చెల్లెళ్ళ కోసంవేకదా. నాకు మీరు వేరే చెప్పాలా" అన్నాన్నేను.

వెళ్ళి హోటల్లో కూర్చున్నాం. రామ్మూర్తి చపాతీకి ఆర్డరిచ్చేడు. నాకు కాఫీ చాలన్నాను. అతను గ్లాసెడు మంచినీళ్ళు తాగి చెప్పటం మొదలెట్టేడు, "నాకు చాలా

ఆకలిగా వుంది మూర్తిగారూ. ఇవాళ పొద్దుట్నించీ కూడు లేదు."

"నిజం ?" ఆశ్చర్యపోయాన్నేను.

"ఏం చెప్పమంటారు మూర్తిగారూ. నిజంగానే ఇవ్వాళ మా ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవలేదు. పిల్లలికిమాత్రం నాలుగు మెతుకులు పడేశాం. మీరు ఏంవీ అనుకోకనే నమ్మకం నాకుంది. నా పాలిటి దేవుడు లాంటివారు మీరేగదా. అంచేతే చపాతీకి ఆర్డరిచ్చేను. ఇంకేదన్నా గూడా తీసుకుంటా"

'అలాగే దానికేంవిటండీ'

చపాతీ వచ్చింది. రామ్మూర్తి చాలా ఆశగా తినసాగేడు. మరికొంచెం కుర్మా తెమ్మని చెప్పి రెండుఇడ్లీకి గూడా ఆర్డరిచ్చేడు. ఆతర్వాత రవ్వట్టు చెప్పేడు. ఆనక కాఫీతాగేడు.

"ఎల్లుండిదాకా నన్ను గురించి బెంగలేదు మూర్తిగారూ, మీ దయవల్ల. ఎటొచ్చీ మా ఆడదానికి మాత్రం...." అంటూ నసిగేడు.

నేను బిల్లుచెల్లించి బయటికివచ్చేను. నా పక్కగా సైకిల్ని నడిపిస్తూ 'చిల్లరుందా గురూగారూ' అన్నాడు. నేను జేబులోవున్న ఎనభై పైసలూ తీసి అతనిచేతి కిచ్చేను. అతను సైకిల్ స్టాండువేసి కిళ్ళీకొట్లో వో సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె, కిల్లీ తీసుకుని ఏభై మూడు పైసలిచ్చేడు. సిగరెట్ వెలిగించుకుని మళ్ళీ నడక మొదలెట్టేడు. బాంబే హోటలు దగ్గరగా వచ్చేం. దాన్లోకి వెళ్ళి రామ్మూర్తి వోచిన్నరొట్టె

తెచ్చేడు. "ఇది తిని మా ఆవిడ కాసిన్ని నీళ్ళు తాగుతుంది మాప్టారూ...." అన్నాడు.

కోనేరుసెంటరు వచ్చింది. అక్కడే మరో అరగంట నిలబడ్డాం. రామ్మూర్తి వాళ్ళఆఫీసు గొడవలు చెప్పేడు. వినాయకరావ్ రాబోయే నాటకంలో అతను ప్రవేశపెట్టున్న కొత్త టెక్నిక్ గురించి కాస్సేపు వివరించేడు. ఆ తర్వాత తన కుటుంబసమస్యలూ మాట్లాడేడు. నేను ఆవలింతల్లోకి దిగేసరికి అతను గమనించేడు. మరోసారి నా ఆదరణకీ. అరువుకీ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

రోజులు గడుస్తున్నాయ్. మా వూళ్ళో సాహితీ సమావేశాలూ, గోష్ఠి కార్యక్రమాలూ ముమ్మరంగా సాగుతున్నై. ఓ ఆదివారం సాయంత్రం టౌన్‌హాల్లో సాహిత్య సమావేశానికి వెళ్ళేను. సభ యింకా ప్రారంభం కాలేదు. స్పీకరులో సినిమా పాటల హోరు ఎక్కువగావుంది. వరండాలోనే నన్ను ఆహ్వానించేడు రామ్మూర్తి. రామ్మూర్తిలో గొప్ప మార్పొచ్చింది. మనిషి ముఖంలో మెరుపూ, కళ్ళల్లోకి కాంతీ వచ్చేయి. కొత్త టెర్లిన్‌గుడ్డలు తొడిగేడు.

"బొమ్మేశారల్లే వుండే గురవ్‌గారు" అన్నాన్నేను అతన్ని ఎగాదిగాచూస్తూ, మా పరిభాషలో బొమ్మెయ్యటమంటే కొత్తగుడ్డలు ధరించటం.

రామ్మూర్తి చాలా హాయిగా నవ్వేడు. కళ్ళజోడుని సరిచేసుకున్నాడు. "అటుపోదాం పదండి" అంటూ నాభుజం

మీద చెయివేసి పక్కకు తీసుకుపోయాడు. పాటలహోరుకు వెనగ్గా వెళ్ళాం.

"మూర్తిగారూ మీకో నిజం చెప్తాను. ఎవ్వరిదగ్గరా అనకూడదు. మీ రలా ప్రామిస్ చేస్తే...."

"అలాగే లెండి........ చెప్పండి........" అన్నాను ఉత్సుకతతో.

రామ్మూర్తి మరోసారి సన్నగానవ్వేడు. మళ్ళీ జోడు సవరించుకున్నాడు. "మొన్న నా పుట్టినరోజండీ. బర్త్‌డే ప్రెజంటుగా వచ్చినయ్—ఇవి." అని తన పాంటు శ్లాక్ వైపు చూపేడు. "మా" లవ్ ప్రెజంట్ చేసింది...."

నేను చకితుణ్ణయి అతనివైపు తేరిపార చూసేను.

"అవునండీ అంతగా ఆశ్చర్యపోకండి మరి. ఈమధ్య వో పిట్టని పట్టేను. స్కూల్లో టీచర్‌గా పన్జేస్తోంది. ఇంతకీ డ్రెస్ ఎలా వుంది."

నేను తెప్పరిల్లుకుని "బాగుంది, చాలా బాగుంది" అన్నాను. నా మేధస్సు అనేక ఆలోచనల్తో నిండిపోయింది. నీతి న్యాయం గట్రా మాట్లాడుతూ వుండే రామ్మూర్తి ఇతనేనా అనిపించింది. ఇంతలో 'సభ ప్రారంభింపబడు తోంది. దయచేసి వరండాలో వున్నవాళ్ళంతా లోపలికి రావలసిందిగా కోరుతున్నాం." అనే ప్రకటన వినిపించింది. మేము లోపలికి వెళ్ళాం.

నాలుగు రోజులతర్వాత అనుకుంటాను. నేను ఇంగ్లీషు మ్యాట్నీకి వెళ్ళాను. నేవెళ్ళి సీట్లో కూర్చునేసరికి న్యూస్‌రీల్

జరుగుతోంది. నాముందు సీట్లోనుంచీ మాటలు వినిపించ సాగేయి.

"అప్పులు చెయ్యటం గురించి నాకు కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నై చంద్రిం. వాడేఁవీ ధర్మం చెయ్యటం లేదుగదా. దానికి అంతగా ఏడవట మెందుకు?—" నాకు ఆ మాట్లాడేది ఎవరో అర్థమైంది, రామ్మూర్తి! అయితే సదరు చంద్రిం మాత్రిం తెలీలేదు.

రామ్మూర్తి చెప్తున్నాడు. "అందుకే వాళ్ళ దగ్గర తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వటాన్ని గురించి ఆలోచించకూడదంటాను."

"అదేఁవిటి, అన్యాయంకదూ, అది?"

"అన్యాయం లేదూ, తోటకూరా లేదు. ఇవ్వాలికివ్వాళ చూడు. మా చంద్రమౌళిగాణ్ని పదిరూపాయలడిగితే పసేఁవిరా లేపన్నాడు. ఇట్లాంటివాళ్ళని నిలువునా పాతెయ్యాలంటాను నన్నడిగితే"

సంగతి తెలిసింది నాకు. చంద్రిమౌళికీ పైసాకూ లంకె. చదంరిమౌళి దగ్గర రామ్మూర్తి కాదుగదా బ్రిహ్మ అయినా అప్పు తీసుకోలేడు. రామ్మూర్తి మాటల్లోని తీవ్రితకీ, కసికీ నాకు ఆశ్చర్యం వేసింది. అప్పు ఇవ్వకపోవటాన్ని నేరంగా భావించటమే గాకుండా తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వక్కర్లేదనే 'ఫిలాసఫీ'ని వొంట పట్టించుకున్నాడన్న మాట. నాకెందుకో ఉన్నట్టుండి కోపమొచ్చింది.

"బనేవా....ది గ్రేట్ బనేవా...." అని నాలో నేను గొణుక్కున్నాను. రామ్మూర్తి ఇంత బతకనేర్చిన వాడా

అని వితర్కించుకున్నాను. రామ్మూర్తి అంతర్యాన్ని అంచనా వేసుకోవటంలో నిమగ్నమైనాను.

ఇంటర్వెల్ లో రామ్మూర్తి నన్ను చూసేడు. విష్ చేసేడు. నేను వద్దంటున్నా వినకుండా, "తీసుకోండి" అంటూ సోడా ఇప్పించాడు. సినిమా గురించి ఏదో విమర్శ మొదలెట్టేడు. సినిమా తిరిగి ప్రారంభం కాగానే నేను ఇంటికి వచ్చేశాను. ఈ సంఘటనతో రామ్మూర్తి అంటే నాకున్న అభిప్రాయం కొంచెం కిందికి దిగింది. దీన్ని గతంలో జరిగిన సంభవాలతో ముడిపెట్టి ఆలోచించసాగేను.

ఆతర్వాత చాలా రోజులు రామ్మూర్తి నాకు కనబడలేదు. నేను మా డిపార్టుమెంటల్ టెస్టుకి చదవటంలో పడిపోయేను. మే మొదట్లో మా పరీక్షలైనాయి.

ఆవేళ—శనివారం. మధ్యాహ్నం రెండు దాటింది. ఎండ చిటచిట లాడుతోంది. గుంటూరునుంచీ మా చెల్లెలు ఉత్తరం రాసింది—ఆవేళే బయల్దేరి వాళ్ళవూరు రమ్మని.

నేను ప్రయాణపు హడావిడిలో వుండగా వచ్చేడు రామ్మూర్తి. మనిషి చాలా అలిసిపోయి వున్నాడు. మొహమంతా చెమటపట్టివుంది.

"రోహిణికి రోళ్ళు పగుల్తాయన్నది ఫ్యాక్టేమాస్టారూ" అంటూ కుర్చీలో కూర్చున్నాడు రామ్మూర్తి. సంచీలోంచి నాప్ కిన్ తీసి పట్టుకుని మొహం తుడుచుకున్నాడు.

"అవునండీ, ఈయేడు ఎండలు చాలా ఎక్కువగా వున్నై." అంటూ షర్టుచేతులు మడుచుకోసాగేను.

"ఏఁవిటీ? ఎటన్నా ప్రియాణమా?" అడిగేడు.

"గుంటూరుదాకా"

,,ఆఁ హాఁ.... మీ సిస్టర్ గారింటికా" అని యేదో ఆలోచిస్తున్నట్టు కొబ్బరిచెట్టుకేసి చూడసాగేడు.

నేను ఇంట్లోకివెళ్ళి క్షణాల్లో తిరిగొచ్చాను.

రామ్మూర్తి లేచేడు. మెట్లు దిగుతూ ,,ఏఁవిటి మేష్టారూ విశేషాలు" అన్నాను.

"కొత్తగా ఏం వున్నయ్ గురూగారూ, మామూలు ఈతిబాధలు తప్ప" అని చిత్రంగా నవ్వేడు.

ఇద్దరమూ నడక సాగించేము.

"మూర్తిగారూ నిజం చెప్పాలంటే ఈ ఈతిబాధలు సమ్మర్ కంటే తీక్షణంగా వున్నాయిసార్. ఫరెగ్జాంపుల్ ఇవాల్టికివాళ...." సగంలో ఆపేసి సైకిలుస్టాండ్ వేశాడు.

నేనూ ఆగేను.

పక్కనేవున్న కిళ్ళీ కొట్టుకేసి నడిచేడు రామ్మూర్తి. దాని ముందు గుంజకుకట్టిన నిప్పుతాడుకు సిగరెట్ వెలిగించుకున్నాడు. సిగరెట్ కేసుని జేబులో వేసుకుంటూ వచ్చి సైకిలు తీసుకున్నాడు.

'ఏం జరిగిందీఇవాళ'—అడిగేను.

"ఏమని చెప్పమంటార్లెండి. డ్యూటీ అయిపోయి ఇంటికి బయల్దేరబోతున్నాను. మా ఆవిడ రిక్షాలో ప్రత్యక్షమైంది. చేతుల్లో పిల్లవాడు. అదే మా రెండోవాడండి. ఉదయంనుంచీ వాంతులట. పిల్లాడు డీలా పడుతున్నాడు.

డాక్టరు దగ్గరికి పోయాం. ముందో ఇంజక్షనిచ్చి మందులు రాసిచ్చేడు. వాళ్ళ నటు ఇంటికి పంపించి నేనిటు వచ్చాను."

"ఇదేవిటండీ. పాపం మీ ప్రభు చాలా ఆరోగ్యంగా వుండేవా డనుకుంటాను"

"ఉండేవాడే. ఈమధ్య బాగా నలిగి పోయాడండీ. పోతపాలు వంటబట్టటం లేదు. వెళ్తూ రిక్షావాడికి డబ్బు లిమ్మంది మా ఆవిడ. జేబులు తడుముకుంటె ఇసకా గసీ తగిలాయి చేతికి."

క్షణంసేపాగి కళ్లజోడు సరిచేసుకుని నావైపు అదోలా చూస్తూ "అసలు లైఫంతా కసిగా గసిగా వుంది మాష్టారూ"

సిగరెట్ పొగను చిత్రంగా పైకి వదలి "ఏం వంటారు" అని ప్రశ్నించాడు.

నేను సన్నగా నవ్వి, "ఇంతకీ మందులు తీసుకున్నారా!" అన్నాను.

"అదేకదా గురూ గారూ చెప్పేది' అని "ఛీ అనుకున్నా, ఛా అనుకున్నా, మీ కివాళ ఇదితప్పదు. అంతగా కావాలంటే నాలుగు దెబ్బలు కొట్టన్నాసరే మీరీ పని చెయ్యాలి మా పిల్లాడిని మీ చేతుల్లో పెట్టేస్తున్నాను." అంటూ హఠాత్తుగా ప్రిస్క్రిప్షన్ తీసి నా చేతిలో వుంచేశాడు. నేను ఆ కాగితంవేపు, ఆ వెంటనే ఆతని వేపూ చూసేను.

"మీరు ఊరి ప్రయాణం కూడా పెట్టుకున్నారు. అడగటానికి మనసొప్పటం లేదుగానీ, అవసరం అలాంటిది."

" ఫర్వాలేదు గానీండి. నాదగ్గర ముప్పయ్యి మాత్రమే వున్నైమరి .... " అంటూ నాన్నేను.

" చూశారుగా లిస్టు. కనీసం వో పదన్నా స్పేర్ చెయ్యండి. "

నేను పది రూపాయిల కాగితం తీసేను. ఆత్రంగా లాక్కున్నాడురామ్మూర్తి. కొన్ని దశాబ్దాల నాటి అప్పు వసూలు చేసుకుంటున్న కాబూలీవాడిలా.

" థ్యాంక్స మాష్టారూ. మరినే వెళ్ళొస్తాను. " అంటూ సైకిల్ వెనక్కి తిప్పేడు.

'అలాగే' అంటూ నేను ముందుకు నడిచేను. రామ్మూర్తి ముందు ఎందుకలా మంత్రముగ్ధుడిలా అయి పోతావని ప్రశ్నించింది మనస్సు. సమాధానం ఇవ్వలేదు. చెవులు చిల్లులు పడేట్టు రైలు కూత వేసింది. ఉలిక్కిపడి తెప్పరిల్లు కున్నాను. గబగబా స్టేషన్ కేసి సాగిపోయాను.

సోమవారం ఉదయం తిరిగివచ్చేనుగుంటూరు నుంచీ. అన్ని విశేషాలతో పాటు రామ్మూర్తి పిల్లవాడి సంగతికూడా చెప్పేను రమకు.

యాంత్రికమైన జీవితం క్యాలెండర్లో మరో రెండు కాగితాల్ని వెనక్కు మడిచేసింది.

శ్రావణ శుక్రవారం. మధ్యాహ్నం కాఫీ టిఫిన్ కి ఇంటికి వచ్చేను. కజ్జికాయలు, కారప్పూస నా ముం దుంచుతూ 'ఈ ఘోరం విన్నారా' అంది రమ.

' ఘోరమేఁవిటోయ్. మహాలక్ష్మిలా ఇలా ముద్దులు కురిపిస్తూ ' అని సరసమాడేను.

"చాల్లెండి సరసం" అంటూ అసలు విషయం చెప్పింది, " ఇవాళ జయమ్మ గారింటికి వెళ్ళేను—ఆవిడని పేరంటానికి పిలుద్దామని. పాపం వాళ్ళ రెండో అబ్బాయి పోయాడు టండీ"

నేను గతుక్కు మన్నాను " ఎవరూ ప్రభువా? "

" అవును. ఆయన మీదగ్గరకొచ్చి డబ్బు తీసికెళ్ళాడు చూడండి—ఆరోజేనట"

"నాకు గుర్తుంది. అయ్యో....పాపం పిల్లాడు దబ్బ పండులా వుండేవాడు," రామ్మూర్తి మీద సానుభూతి నా మనసంతా నిండిపోయింది.

"ఆవిడ పాపం నన్ను కౌగిలించుకుని బావురుమంది. ఆరోజు సాయంత్రం ఐదింటిదాకా హాయిగా తిరిగేట్ట. శుభ్రంగా ఆడుకున్నాట్టండీ"....

"ఏఁవిటీ?" నేను కళ్ళు పెద్దవిచేసేను.

"అవును. సాయంత్రం ఐదున్నర-ఆరు గంటలప్పుడు వాడికి ఫిట్స్ వచ్చేయిట. హాస్పటల్ కు తీసుకుపోతుంటే దారిలోనే పోయాట్ట పాపం" క్షణంసేపు ఆగి "మీవారి దగ్గర పిల్లవాడి మందులకి కావాలని అబద్ధాలుచెప్పి ఆరోజే అప్పు తెచ్చారట్ట డబ్బు, ఆయన ఇంటికొచ్చేసరికే అంతా అయిపోయింది. ఇది చెప్పి ఆయన ఎంతగా బాధపడ్డారో చెప్పలేను.

ఆ విషయాన్ని గురించే ఈనాటివరకు కుమిలిపోతున్నారు" అంటూ చాలాసేపు బాధపడిందండీ జయమ్మ. అన్నట్టు ఇంకోసంగతికూడా ఆయనకి రాజమండ్రి బదిలీ అయిందట. వెళ్ళి జాయిన్ అయ్యాడట. ఇప్పుడిక్కడ లేడు...."

నా మేధస్సు మొద్దుబారిపోతున్నట్టు ఫీలయ్యాను. కంట్లో నలకపడి తోచనీయటంలేదు. ఇంతకీ రామ్మూర్తి బతకనేర్చినవాడో బతక నేర్వనివాడో అర్థంకావటంలేదు! *